క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

రామసముద్రం: రామసముద్రం మండలం దిన్నిపల్లి సమీపంలో ఉన్న 132 కేవీ ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్ నిర్వాహణ కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ మస్తాన్ శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు దృష్టిలో ఉంచుకొని అంతరాయనికి సహకరించాలని కోరారు.

రేపు రుద్రాభిషేకం

మదనపల్లె సిటీ : ఆషాడమాసశుద్ధ తొలి ఏకాదశిని పురస్కరించుకుని, మడికయ్యల శివాలయం యోగభోగేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశవార రుద్రాభిషేకం, రుద్ర హోమం ఆదివారం నిర్వహిస్తున్నట్లు అర్చకులు టి.విశ్వేశ్వరప్రసాద్ తెలిపారు. కార్యక్రమానికి పెద్దసంఖ్యలో భక్తులు హాజరై యోగభోగేశ్వర స్వామిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ప్రత్యేక ప్రార్థనలు



అజ్మీర్ దర్గాకు చాదర్ తీసుకువెళుతున్న నిసార్‌అహ్మద్ దంపతులు

మదనపల్లె రూరల్ : ప్రజానాయకుడు, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ దంపతులు శుక్రవారం రాజస్థాన్ రాష్ట్రం అజ్మీర్ దర్గాలో చాదర్‌ను సమర్పించారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ అజ్మీర్ దర్గాను దర్శించుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షిస్తూ, ప్రజలకు మేలు జరగాలని అల్లాహ్‌ను కోరుకున్నట్లు తెలిపారు.

కమనీయం.. కల్యాణం



స్వామి వారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెద్దతిప్పసముద్రం: స్థానిక శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో శుక్రవారం స్వాతి నక్షత్రం సందర్భంగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవ వేడుకలు కనుల పండువగా నిర్వహించారు. వేద పండితులు స్వామి వారి విగ్రహ ప్రతిమలను పుష్పాలతో అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఆలయ స్థలం పరిశీలన



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న జిల్లా దేవదాయశాఖ అధికారి సి. విశ్వనాథ్

మదనపల్లె రూరల్ : మండలంలోని కోళ్లబైలు పంచాయతీ ఇందిరమ్మకాలనీలో ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి కాలనీవాసులు కోరుతున్న ప్రభుత్వస్థలాన్ని శుక్రవారం జిల్లా దేవదాయశాఖ అధికారి సి.విశ్వనాథ్ పరిశీలించారు. కాలనీవాసులతో కలిసి స్థలాన్ని పరిశీలించిన ఆయన ఆలయ నిర్మాణానికి అనువైన స్థలంగా సంతృప్తి వ్యక్తం చేశారు. కాలనీవాసుల వినతిమేరకు సర్వే నంబర్ 614/2లో 10 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాల్సిందిగా మండల తహసీల్దార్‌కు లేఖ రాశామన్నారు. రెవెన్యూ అధికారుల నుంచి నివేదిక వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వై.శ్రీనివాసులురెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

చేనేత బ్యాగుల పంపిణీ



విద్యార్థులకు చేనేత బ్యాగులు పంపిణీ చేస్తున్న నాయకులు

కురబలకోట: మదనపల్లె హ్యాండ్ లూమ్స్ వర్కర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో అంగళ్ల గ్రామంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు శుక్రవారం 500కు పైగా చేనేత బ్యాగులు పంపిణీ చేశారు. చేనేత కార్మిక యూనియన్ పట్టణ అధ్యక్షుడు కె. శ్రీనివాసుల రెడ్డి, నాయకులు రామ్మోహన్, కురబలకోట మండల చేనేత విభాగ నేత వినాయక చేనేత నగర్ భాస్కర్ రెడ్డి నేతృత్వంలో వీటిని అందజేశారు. టి. ప్రతాప్‌రెడ్డి, ఎం. శివకేశవ, యూత్ లీడర్ శెట్టి భాను ప్రకాష్ పాల్గొన్నారు.

నివాళి

కలికిరి(వాల్మీకిపురం): విశ్రాంత పోస్టుమ్యాన్, గిరిజన నాయకుడు గాడ గంగయ్య (90) శుక్రవారం ఉదయం గుండెపోటుతో చికిత్స తీసుకుంటూ ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో గాడ గంగయ్య మృతదేహానికి నివాళులు అర్పించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతల శివానందరెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ జమకాయల క్రిష్ణమూర్తి, నీళ్ల భాస్కర్ తదితరులు గంగయ్య మృతికి సంతాపం తెలిపారు.

గుర్రంకొండలో బయటి రాష్ట్రాల వ్యక్తులు

- ఎనిమిది రాష్ట్రాలకు చెందిన వారు నివాసం
- గతంలో నేర చరిత్ర కలిగిన వ్యక్తులను అరెస్టు చేసిన పోలీసులు
- ఇతర ప్రాంతాల వారికి గుర్తింపు ఏది?



గుర్రంకొండ పట్టణం

గుర్రంకొండ: రాయచోటిలో ఉగ్రవాదుల అరెస్ట్‌తో గుర్రంకొండ వాసులు ఉలిక్కిపడ్డారు. గుర్రంకొండ పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో ఎనిమిది రాష్ట్రాలకు చెందిన వారు నివాసిస్తున్నారు. ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు ఇక్కడ ఉంటున్నారు. వీరంతా ఇటుకల బట్టీల్లో.. ఎలక్ట్రిషన్లు, తాపీ మేస్త్రీలు, డ్రైవర్లు, చిరువ్యాపారులు, వడ్డీ వ్యాపారులు, కోళ్ల, పౌల్ట్రీల ఫారమ్స్‌లో, టమాటా మండీల్లో వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్నారు. రెండు వేల మంది గుర్రంకొండ పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్నారు.

నేరచరిత్ర కలిగిన వారు ఎందరో?

దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ పలు రకాల పనులు చేసుకొంటున్నారు. నేర చరిత్ర కలిగిన వారు ఉన్నారనే సమాచారం స్థానికులను కలవర పెడుతోంది. గతంలో జరిగిన సంఘటనలు స్థానికుల అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయి. ఏడాదిన్న క్రితం జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఒక పెయింటర్ అక్కడ ఓ ఇంట్లో పనిచేస్తూ ఆ ఇంటి యజమాని కుమార్తెను ప్రేమపేరుతో తీసుకొచ్చి మండలంలోని తరిగొండ వద్ద ఉన్న ఉసిరికాయల తోటలో వాచ్‌మెన్‌గా పనిచేసేవాడు. అయితే ఆరునెలల క్రింతం జార్ఖండ్ పోలీసులు సదరు వ్యక్తిని అరెస్ట్ చేసి తీసుకెళ్లిపోయారు. ఏడేళ్ల క్రితం నేపాల్‌కు చెందిన ఓ వ్యక్తి అనుమానాస్పదంగా గుర్రంకొండ పట్టణంలో నివాసముండడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి ఆరునెలల క్రితం మద్యం మత్తులో గుర్రంకొండలో ద్విచక్రవాహనంతో రిటైర్డ్ కానిస్టేబుల్‌ను ఢీ కొనడంతో అతను మృతి చెందాడు. కర్నాటక రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి తనతో పాటు ఓ అమ్మాయిని ప్రేమించి వివాహం చేసుకొని మండలంలోని మర్రిపాడు గ్రామంలో ఓ రైస్ మిల్లులో దినసరి కూలీగా పనిచేసేవాడు. అయితే ఏడాది తరువాత భార్యను హత్య చేసి కర్నాటకకు మృతదేహాన్ని గుట్టుచప్పుడు కాకుండా తరలించాడు.

గుర్తింపు కార్డులేవీ?

గుర్రంకొండ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి గుర్తింపు కార్డులు గానీ, ఆధార్ కార్డులుగానీ ఉన్నాయోలేవోననే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎవరైతే బయట రాష్ట్రాల వారిని తీసుకొస్తారో సదరు యజమానులు వారి వివరాలను పోలీసులకు అందజేయాలి. భవిష్యత్తులో వారు ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరంటూ భరోసా ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఇవేవి పట్టించుకోకుండా పలువురు వీరిని గుర్రంకొండకు తీసుకొస్తున్నారనే విమర్శలున్నాయి.

నిఘా పెడతాం



బయట ప్రాంతాల వ్యక్తుల పై నిఘా పెడతాం. ఎవరన్నా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులను పనుల కోసం తీసుకువస్తే వారి గురించి పూర్తి సమాచారం తెలుసుకోవాలి. వారికి తప్పనిసరిగా గుర్తింపు కార్డులు ఉండాలి.

– రఘురామ్, ఎస్‌ఐ, గుర్రంకొండ

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు



ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని సత్కరించిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం నేతలు



మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం నేతలు

బి.కొత్తకోట: రాష్ట్రంలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన్ను వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోన్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరీరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాయితీ మహిత ఆనంద్ కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో మహిళల భద్రత విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం, కర్నూలుజిల్లా ముచ్చుమర్రి, చిత్తూరుజిల్లా పుంగనూరులో, వివిధ ప్రాంతాల్లో మహిళలపై జరిగిన దారుణాలపై చర్చించారు. ఇలాంటి పరిస్థితి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లేదని గుర్తు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దిశ యాప్ ద్వారా ఎంత మంది మహిళలను, చిన్నారులను కాపాడిందో లెక్కలు ఉన్నాయి, కూటమి ప్రభుత్వం ఏ మేరకు భద్రత కల్పించిందో చెప్పగలదా అని ప్రశ్నించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఎందుకు అమలు చేయడం లేదన్నారు. ఏడాది పాలనలో కూటమి నాయకులు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని, వచ్చే ఎన్నికల్లో ఘోర పరాజయం తప్పదని పేర్కొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళదాం

కలికిరి(వాల్మీకిపురం): రాష్ట్రంలోని ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళదామని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. వాల్మీకిపురంలోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరీ రెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి కాయితి మహిత ఆనంద్ ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేస్తోందని, రాష్ట్రంలో మహిళలపై దాడులు, అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని, మహిళలకు రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ మహిళా విభాగం తరపున రాష్ట్రంలో మహిళలకు జరుగుతున్న అన్యాయాలపై క్షేత్ర స్థాయిలో చైతన్యం తీసుకురావాలన్నారు. అక్రమ అరెస్టులు, కుట్రలకు భయపడకుండా పార్టీ పటిష్టతకు పనిచేయాలని ఆయన కోరారు. అనంతరం మహిళా నేతలు మాజీ ఎమ్మెల్యేను సన్మానించారు.

బడిబాట పట్టిన పిల్లలు

మదనపల్లె సిటీ : బడి బాట కాదు..భిక్షాటన శీర్షికన సాక్షి దిన పత్రికలో శుక్రవారం ప్రచురిత మైన వార్తకు విద్యాశాఖ అధికారులు స్పందించారు. పట్టణంలో ఎందరో చిన్నారులు, చదువుకోవాల్సిన వయస్సులో భిక్షాటన చేయడాన్ని సాక్షి వెలుగులోకి తేవడంతో మండల విద్యాశాఖ అధికారులు హుటాహుటిన బయలుదేరారు. పట్టణశివారు ప్రాంతంలో టెంట్లు వేసుకుని నివాసం ఉంటున్న వారిని గుర్తించి, బడికి వెళ్లని పిల్లలను సమీపంలోని బడిలో చేర్పాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, రమణ, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి ఎఫెక్ట్..



చిన్నారులతో ఎంఈఓ ప్రభాకరరెడ్డి

మూగజీవాల సంరక్షణకు చర్యలు

బి.కొత్తకోట: గొర్రెలు, మేకల్లో నులి పురుగులను నివారించేందుకు ఈనెల 10 దాక నట్టల నివారణ కార్యక్రమం అమలు చేస్తున్నట్టు పశుసంవర్ధకశాఖ ఏడీ నీరజ అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని పెద్దపల్లెలో జరుగుతున్న కార్యక్రమాన్ని పరిశీలించారు. నులి పురుగుల నివారణ కోసం మూగజీవాలకు మందును తాపించారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న నట్టల నివారణ కార్యక్రమం వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు.

ప్రజా భాగస్వామ్యంతోనే డెంగీ నివారణ



మాట్లాడుతున్న జిల్లా మలేరియా నియంత్రణ అధికారి ఆర్. రామచంద్రారెడ్డి

మదనపల్లె : ప్రజా భాగస్వామ్యంతోనే శాత శాతం డెంగ్యూ నివారణ సాధ్యమని అన్నమయ్యజిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ లక్ష్మీనరసయ్య అన్నారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మదనపల్లె అర్బన్ పరిధిలోని త్యాగరాజువీధి, దొంతివీధి, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వైద్యాధికారులు జిలాన్, సాల్మన్‌లతో సమీక్ష నిర్వహించారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాల బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేను పాటించాలని సూచించారు. అనంతరం ప్రధానమంత్రి టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమ పనితీరుపై సిబ్బందిని ఆరా తీశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎడ్యుకేషన్ హెల్త్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, సబ్ యూనిట్ అధికారి ఖలీల్, సూపర్‌వైజర్ మహి, టీబీ పర్యవేక్షకులు ప్రభాకర్, డీఈఓ భాస్కర్, ఫార్మసిస్ట్, స్టాఫ్ నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణతోనే మలేరియాకు అడ్డుకట్ట

పీలేరు : దోమల వ్యాప్తిని అరికట్టడంతో మలేరియా వ్యాధి నివారణకు అడ్డుకట్ట వేయవచ్చని జిల్లా మలేరియా నియంత్రణ అధికారి ఆర్. రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ మాసోత్సవాల సందర్భంగా స్థానిక కోటపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఇంటి పరిసరాల్లో డెంగీ వ్యాధులకు కారణమయ్యే టైగర్ దోమ, తమ సంతతిని ఉత్పత్తి చేసే నీటి నిల్వలను శుభ్రం చేసి తాజా నీటి నిల్వలపై మూతలు పెట్టాలన్నారు. వ్యాధుల రహిత సమాజాన్ని నిర్మించడానికి సమష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్, హెచ్‌ఎం శివశంకర్, హెచ్‌ఈ కొండయ్య, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసులు, పర్యవేక్షకులు కుసుమ, రెడ్డెప్ప, ఏఎన్ఎంలు భార్గవి, లక్ష్మీ, చంద్రకళ పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలే ధ్యేయం

మదనపల్లె రూరల్ : సారా రహిత గ్రామాలుగా తీర్చిది ద్దడమే ధ్యేయమని, ఇందుకోసం ప్రజలు సహకరించాలని ఎక్సైజ్ సీఐ భీమలింగ కోరారు. నిమ్మనపల్లె మండలంలోని బండ్లపై, పరేసువాండ్లపల్లె, నాగులయ్యగారిపల్లె, బాలేవాండ్లపల్లె గ్రామాలను సారారహిత గ్రామాలుగా శుక్రవారం ఎక్సైజ్ సీఐ ప్రకటించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సారాను పూర్తిగా నిర్మూలించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలనే లక్ష్యంతో నవోదయం 2.0ను రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

మదనపల్లె సిటీ : ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత పొందవచ్చని జిల్లా దేవదాయ శాఖ అధికారి సి.విశ్వనాథ్ అన్నారు. మండలంలోని వలసపల్లె పంచాయతీ కాకరకాయలపల్లెలో సీజీఎఫ్ నిధులు రూ.60లక్షలతో వెంకటరమణ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. జూన్ 6న మహా కుంభాభిషేకం తర్వాత ఆలయంలో 41 రోజులు మండల పూజలు విశేషంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన జిల్లా దేవదాయ శాఖ అధికారి సి.విశ్వనాథ్‌కు కమిటీసభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మదనపల్లె గ్రూప్ టెంపుల్స్ ఈఓ పి.రమణ, జి.వెంకటరమణ, బాలఅంకన్న, బద్దెల గోవర్ధన్,గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చండి



అధికారులకు సమస్యలు చెబుతున్న సభ్యులు

గుర్రంకొండ: మండలంలోని మొటుకు, చింతలవారిపల్లె గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలను తీర్చాలని సభ్యులు మండలమీట్‌లో డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సీతమ్మ ఆధ్వర్యంలో మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలను సమావేశంలో ప్రస్తావించారు. మండలంలోని మొటుకు, మొటుకుకాలనీ, చింతలవారిపల్లెలోతాగునీటి సమస్య నెలకొందని వెంటనే సమస్యల పరిష్కరించాలని ఎంపీటీసీ సభ్యులు గంగులమ్మ, బాబయ్యలు డిమాండ్ చేశారు. మొటుకులో ఇప్పటికే బోరుబావి తవ్వకాలు చేపట్టామని నీరు పడలేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లాల్‌స్వామి అన్నారు. టమాటా పంటకుఇచ్చే సబ్సిడీ ఎల్లుట్ల గ్రామానికి ఇవ్వలేదని, అసలు ఎవరెవరికి ఇచ్చారో చెప్పాలని ఎంపీటీసీ సభ్యులు రాజగోపాల్ కోరారు. ఆ సయమంలో తాను సెలవులో ఉన్నాని వివరాలు కనుక్కొని చెబుతానని ఏవో రత్నమ్మ తెలిపారు.

వైద్య సేవలు అందడం లేదు

గుర్రంకొండ ప్రభుత్వాస్పత్రిలో రోగులకు సరైన వైద్య సేవలు అందించడం లేదని, రోగుల పట్ల వివక్షచూపిస్తున్నారని, మందులు కూడా సరిగ్గా ఇవ్వడం లేదని వైస్ ఎంపీపీ కారుణాకర్ ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకుంటామని వైద్యాధికారి చైతన్య సమాధానమిచ్చారు. తరిగొండ గ్రామంలో బ్యాంకు రుణాలు చెల్లించినా డ్వాక్రా రుణాలు పలు సంఘాలకు మంజూరు కావడం లేదని, ఈవిషయమై అధికారులు పట్టించుకోవడం లేదని వైస్‌ఎంపీపీ సరస్వతి అన్నారు. ఆన్‌లైన్‌లో కొన్ని టెక్నికల్ సమస్యలు ఉన్నాయని, దీంతో రుణాల మంజూరుకు జాప్యం జరుగుతోందని, తొందరలోనే సమస్య పరిష్కరించి రుణాలు మంజూరు చేస్తామని వెలుగు సీసీ రాజగోపాల్ తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచ్ రౌనఖ్‌బాషా, వైస్‌ఎంపీపీ సరస్వతి, ట్రాన్స్‌కో డీఈ శివయ్య, ఎఈ మొసీన్, ఏఎస్ఐ గజేంద్ర, ఎంఈవో సుబ్రమణ్యం, ఏపీవో జయరామిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

పీలేరురూరల్ : ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక గ్యారేజ్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కె. బాషా, ఆర్.వి. రమణ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ బస్సులు ఆర్టీసీ ద్వారానే కొనుగోలు చేయాలన్నారు. 1/2019 సర్కులర్‌ను యథావిధిగా కొనసాగించాలన్నారు. డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. కాలం చెల్లిన ఆర్టీసీ బస్సులు బ్రేక్ డౌన్‌పై గ్యారేజీ సిబ్బందిపై ఇస్తున్న చార్జీసీట్లు రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈయూ ట్రెజరర్ వేణుగోపాల్‌రెడ్డి, డెలిగేట్స్ కె.వి. రమణ, నాయకులు ఎస్.ఎం. బాషా, కుమార్, పురుషోత్తం , శ్రీరాములు, ఎస్.వి. రమణ, రాధ, శోబారాణి, రవినాయక్, అరుణమ్మ పాల్గొన్నారు.

మదనపల్లె సిటీ : ఆర్టీసీ ఉద్యోగులందరికీ ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లను ఇవ్వాలని, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్.వి.కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై శుక్రవారం ఆర్టీసీ టూ డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీనే సొంతంగా కొనుగోలు చేసి, ఆర్టీసీ సిబ్బందితో నడపాలన్నారు. పెరుగుతున్న ప్రయాణీకుల సంఖ్యకు అనుగుణంగా కొత్త బస్సులను వెంటనే కొనుగోలు చేయాలన్నారు. ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్‌లో చేర్పించి, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ డిపో అధ్యక్షులు పూల శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీ సి.సుగుణ, బీసీఎస్. నాయక్, , వన్‌డిపో సెక్రటరీ ఈశ్వరప్ప, టూ డిపో సెక్రటరీ బి.మధు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి షేక్ ముబారక్, పట్టణ కార్యదర్శి తిరుమలప్ప తదితరులు పాల్గొన్నారు.

క్యూఎన్‌ఎక్స్‌తో మిట్స్ ఒప్పందం

కురబలకోట: ప్రఖ్యాత టెక్నాలజీ సంస్థ బ్లాక్ బెర్రీ క్యూఎన్ఎక్స్‌తో అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలతో శుక్రవారం కీలక ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా జరిగిన అవగాహన కార్యక్రమంలో స్క్వేర్ టెక్నాలజీస్ సీఈఓ శ్రీనివాసరాజు, అనలిస్టు మధుసూధన్, క్యూ ఎన్ఎక్స్ ఎంట్రీవేర్ డైరెక్టర్ దశరథ్ పాల్గొన్నారు.

ఈ ఒప్పందంతో విద్యార్థులకు పరిశ్రమతో అనుసంధానమైన విద్య, ఎంబడెడ్ టెక్నాలజీపై శిక్షణ అవకాశాలు లభిస్తాయన్నారు. తాజా టెక్నాలపై ప్యాకల్టీకి కూడా శిక్షణ అవగాహన కార్యక్రమాలు లభిస్తాయన్నారు. క్యూ ఎన్ఎక్స్‌తో మిట్స్ ఒప్పందం టెక్నాలజీ రంగంలో కీలక ముందడుగు పడినట్లేనని పేర్కొన్నారు.

హమాలీల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు

పీలేరు : హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, నియోజకవర్గ కార్యదర్శి నరసింహులు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ అన్నారు. కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం సమ్మె కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయాలని, 8 గంటల పని దినాలు కొనసాగించాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 9న కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని కోరారు. 45 ఏళ్లు దాటిని హమాలీ కార్మికులకు నెలకు రూ. 6 వేలు పింఛన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హమాలి వర్కర్స్ పి.వి. రమణ, దాము, వెంకటేష్, రామచంద్ర, మల్లికార్జున, సురేష్, రోహిత్, మురళి తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండ: నాలుగు లేబర్ కోడ్ రద్దు చేయాలని చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెలో అందరూ పాల్గొనాలని జిల్లా కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి రమేష్ బాబు కోరారు. శుక్రవారం కార్మికులు, ఉద్యోగులతో కలసి వైద్యాధికారి చైతన్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 9 తేదిన కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఎస్ఎమ్ సంఘం కార్యదర్శి మెహర్ ఉన్నిసా, ఆశావర్కర్లు సుభాషిణి, దేవి పాల్గొన్నారు.

ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ

పీలేరు : ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గంలో 11,500 మంది దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. వీరిని బంగారు కుటుంబాలకు గుర్తించడం, పీ4 విధానంలో ఆ కుటుంబాల జీవన ప్రమాణాల పెంపుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి ఉద్యోగి తమ ఇళ్లపై సూర్యఘర్ యోజన సోలార్ ఏర్పాటు చేసుకుని ప్రజలకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఒక కిలో వాట్ యూనిట్ ఏర్పాటుకు రూ. 2 లక్షలు వ్యయం కాగా 80 శాతం బ్యాంకు రుణంగా పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మూర్తి, శ్రీకాంత్‌రెడ్డి, అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి



మాట్లాడుతున్న పాలకుంట్ల శ్రీనివాసులు

పీలేరురూరల్ : మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె పంచాయతీ బుద్ధుని కొండపై బుద్ధుడి విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలని బాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక బాస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుద్ధుని కొండను మానవ వికాస్ కేంద్రంగా, గొప్ప ఆధ్మాత్మిక చైతన్యకేంద్రంగా రూపొందించాలనే ఉన్నతాశయంతో బాస్ వ్యవస్థాపకులు పి.టి.ఎం. శివప్రసాద్ బుద్ధుని ఒక్కొక్కటిగా నిర్మాణాలు చేపట్టే సమయంలో ధ్వంసం చేయడం హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో బాస్ నాయకులు నాగరాజ, రవీంద్ర, హరినాథ, గురవయ్య, రామచంద్ర, హరిప్రసాద్, సలీమ్, భాస్కర్, బోడేషా పాల్గొన్నారు.

దళితులకిచ్చే గౌరవం ఇదేనా బాబూ?


ఎస్సీసెల్ నేత ఎస్టీడీ హరి



కలికిరి: దళితులను అవమానించి ఆనందపడడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు అలవాటుగా మారిందని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ ఉమ్మడి చిత్తూరు జిల్లా నేత ఎస్టీడీ హరి ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గతంలో దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని అవమానించారని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో మాత్రమే దళితుల ఓట్ల కోసం ఆయన నటిస్తారని, అధికారం చేపట్టిన తరువాత దళితులను అవమానించడం పరిపాటిగా మారిందని విమర్శించారు. పార్టీలకతీతంగా దళిత మేధావులు రాష్ట్రంలో దళితులకు జరుగుతున్న అవమానాలు, దళిత ఆడ బిడ్డలపై జరుగుతున్న అఘాయిత్యాలను కలిసి కట్టుగా ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల చంద్రబాబు తనను తాను రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌తో పోల్చుకోవడం దారుణమన్నారు. చంద్రబాబు చేస్తున్న దారుణాలపై దళితులు గళమెత్తడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

సంక్షేమ పథకాలు కొందరికేనా?

మండల మీట్‌లో అధికారులను ప్రశ్నించిన వైస్ ఎంపీపీ ఖాదర్‌వలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి నీలకంఠారెడ్డి

బి.కొత్తకోట: పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం.. కొందరికి మాత్రమే వాటిని పరిమితం చేసిందని వైస్ ఎంపీపీ ఖాదర్‌వలి అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం బి.కొత్తకోట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ లక్ష్మీనరసమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిని సమంగా అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని అన్నారు. తమ ప్రభుత్వంలో ఇలా వివక్ష చూపలేదన్నారు. అధికారుల పనితీరుపై మండిపడగా మినీ గోకులాలు అందరికి మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ. కృష్ణవేణి హామీ ఇచ్చారు. బోర్లు వేసి కనెక్షన్ల కోసం రైతులు ఎదురుచూస్తుంటే డిస్కం అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వకుండా వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సర్పంచ్ భీమిగాని నాగిరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు ఎప్పుడు ఏర్పాటు చేస్తారని అధికారులను నిలదీశారు. డిస్కం ఏఈ హాజరుకాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. బి.కొత్తకోటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పీటీఎంకు తరలించారని, దీన్ని గట్టులో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. భూములు జాయింట్ పట్టాలు ఉండటంతో తల్లికి వందనం పథకం అమలు కాలేదని తహసీల్దార్ బావాజాన్ దృష్టికి తీసుకురాగా దీనిపై రైతులు సబ్‌డివిజన్‌కు దరఖాస్తు చేసుకుంటే వాటిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. జెడ్పీటీసీ రామచంద్ర మాట్లాడుతూ అధికారులు ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలని కోరారు. ప్రత్యేకాధికారి, హెచ్ఎన్ఎస్ఎస్ ఈఈ నీలకంఠారెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పరిష్కరించాలని కోరారు.

కూటమి కార్యకర్తలకేం పని?

మండల పరిషత్ సమావేశానికి అనధికారులు, సభ్యులుకాని వారికి ఆహ్వానం ఉండదు. ఒకవేళ వచ్చినా బయటకు వెళ్లాల్సిందే. అయితే అధికారులు టీడీపీ, బీజేపీ, జనసేనకు చెందిన కార్యకర్తలకు ఆహ్వానం ఇచ్చి సమావేశానికి రప్పించడంపై ఎంపీటీసీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హాజరైన కూటమి కార్యకర్తలు అధికారులను ప్రశ్నించడం, వివరాలు అడగటం ఆశ్చర్యానికి గురి చేసింది.

అభివృద్ధిపై చర్చలేదు

మండల పరిషత్ సమావేశంలో మండలంలో జరుగుతున్న, మంజూరైన అభివృద్ధి పనులపై ఒక్క అధికారి కూడా మాట్లాడలేదు. పేరుకు అభివృద్ధిపై సమీక్ష అని చెప్పినా చర్చే జరుగలేదు. సమావేశంలో ఎంపీటీసీలు రామసుబ్బయ్య, యల్లప్ప, ఎ.గౌతమి, బూదల ఈశ్వరమ్మ, ఎ.రమాదేవి, విమలమ్మ, రామసుబ్బారెడ్డి, సర్పంచులు సాంబశివ, రుక్మిణి, గిరిజ, రవికుమార్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.